క్లుప్తంగా...

నేడు ఆత్మీయ సమ్మేళనం



ఆదం సంతోష్ కుమార్

సికింద్రాబాద్: సీతాఫల్ మండిలోని మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్లో ఈ నెల 28 (నేడు) ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్టు పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తన పుట్టిన రోజు పురస్కరించుకుని రాజకీయాలకతీతంగా సికింద్రాబాద్ ప్రజలతో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశామన్నారు. గడచిన మూడు దశాబ్దాలుగా సికింద్రాబాద్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 7 గంటల నుంచి ప్రారంభమయ్యే సమ్మేళనానికి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సహా పలువురు పీసీసీ నాయకులు హాజరవుతారన్నారు.

కట్టమైసమ్మ బోనాల జాతర టెండర్లు ఖరారు

చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ బోనాల జాతరకు సంబంధించిన పలు టెండర్లు ఖరారు అయ్యాయి. ఆలయ ప్రాంగణంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో టెండర్లను పరిశీలించి తక్కువ ధర వేసిన వారికి ఖరారు చేస్తూ ఆలయ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జూలై 16,17వ తేదీల్లో జరిగే చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ బోనాల జాతరలో ఎలక్ట్రికల్ పనులు, విద్యుత్‌దీపాలు, పూల అలంకరణ, ఆలయానికి రంగులు తదితర పనులకు సీల్డ్ టెండర్లను ఆహ్వానించారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, భక్తుల సమక్షంలో ఆలయ నిర్వాహకులు టెండర్లను తెరిచి పనులను అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఈఓ మహేందర్‌గౌడ్, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఆండాళ్, ఆలయ ప్రతినిధులు, బస్తీపెద్దలు పాల్గొన్నారు.

శివసత్తులకు ప్రత్యేక దర్శనం కల్పించాం

- ఈఓ అన్నపూర్ణ

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణానికి విచ్చేసిన శివసత్తులకు గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక దర్శనం కల్పించడం జరిగిందని ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎస్.అన్నపూర్ణ తెలిపారు. మంగళవారం శివసత్తుల సంఘం నాయకురాలు జోగిని శ్యామల ఇతర సభ్యులతో కలిసి ఈఓ అన్నపూర్ణతో పాటు చైర్మన్ సాయిబాబా, పాలక మండలి సభ్యులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ.. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాల మేరకు దాదాపు 5 వేల మంది శివసత్తులను వీవీఐపీ క్యూలైన్‌లో పంపి అమ్మవారి దర్శనం చేయించామన్నారు.

ఎన్‌-సెట్‌కు గడువు పొడిగింపు

లాలాపేట: ఐసీఎంఆర్‌-నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, ఓయూ అనుబంధంగా 2023కి పలు రెగ్యులర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ఎమ్మెస్సీ(అప్లయిడ్ న్యూట్రిషన్), ఎమ్మెస్సీ (స్పోర్ట్స్ న్యూట్రిషన్)లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎన్‌-సెట్ (ఎన్ఐఎన్ కామన్ ఎంట్రెన్స్ టెస్టు)కు దరఖాస్తు సమర్పించే గడువును జూలై 3వ తేదీ వరకు పొడిగించినట్లు డైరెక్టర్ ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 040-27197247, 27197311 నంబర్లను సంప్రదించాలన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కంటోన్మెంట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆరోగ్యవంతులు తరచూ రక్తదానం చేయాలని ఆర్టీసీ సికింద్రాబాద్ డిప్యూటీ ఆర్ఎం అపర్ణా కళ్యాణి పేర్కొన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు కంటోన్మెంట్ డిపో ఆవరణలో మంగళవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సకాలంలో రక్తం అందక ప్రతీయేటా పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారని ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో రక్తదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రామ్మోహన్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీపతి కృష్ణ, ఎం.ఎఫ్. బాలరాజ్, సేఫ్టీ వార్డెన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన సాగమ్ లాల్‌రే

సనత్‌నగర్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ వరలక్ష్మి వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన సాగమ్ లాల్‌రే (45) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి భార్యాపిల్లలతో ఉంటున్నాడు. గతంలో వెల్స్‌పూన్ ఫ్లోరింగ్ లిమిటెడ్‌లో ఆపరేటర్‌గా పనిచేసి మానేశాడు. ప్రస్తుతం ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న సాగమ్ లాల్‌రే సోమవారం రాత్రి బేగంపేట హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ముందున్న బస్టాప్ వద్దకు వచ్చి నిలబడగా కాసేపటికి కిందపడిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా మృతి చెంది ఉన్నాడు. మద్యంమత్తులో కిందపడిన క్రమంలో తలకు బలమైన గాయమై మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

రోడ్డుపైనే పార్కింగ్!



- ట్రాఫిక్ జామ్‌కు చిరునామాగా వారాసీగూడ చౌరస్తా

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్ వారాసీగూడ చౌరస్తా ట్రాఫిక్ జామ్‌కు అడ్డాగా మారింది. ఈ చౌరస్తా సికింద్రాబాద్‌లో ఎంతో కీలకమైన ప్రాంతం. ప్రతి నిత్యం వేలల్లో రాకపోకలు, వ్యాపారాలు, కూలీలతో రద్దీగా ఉంటుంది. ఇలాంటి కీలకమైన ప్రాంతంలో ప్రతి రోజు ట్రాఫిక్ జామ్‌తో నరకాన్ని చవిచూస్తున్నామని వాహనదారులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ ఉన్న వ్యాపార సముదాయాలు, ఆటోలు రోడ్లను ఆక్రమిస్తున్నాయి. ఈ మూలమలుపు వద్ద ఆటోవాలాలు ప్రయాణికుల కోసం తిష్టవేసి ఉంటారు. దీంతో సగం రోడ్డు ఆటోలతోనే నిండిపోతుంది. ద్విచక్ర వాహనాలు వెళ్లేంత మాత్రమే రహదారి ఉండటంతో తరచుగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది.

కానరాని ట్రాఫిక్ పోలీసులు..

ఇదే ప్రాంతంలో రెండు మద్యం దుకాణాలు ఉండటంతో మందు బాబులు నడి రోడ్డుపై తమ తమ వాహనాలు నిలుపుతుండటంతో బాటసారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్‌లు ఉండటంతో గంటల తరబడి ఇక్కడే వాహనాలను ఉంచుతున్నారు. సాయంత్రం ఈ రద్దీ మరీ ఎక్కువగా ఉంటుంది. అంతేకాక మందుబాబుల ఆగడాలతో అటుగా రాకపోకలు సాగించే మహిళలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు వచ్చిన సమయంలో చాలా సమయంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుండటంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ చౌరస్తాలో ఇంత జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి వారాసీగూడ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్‌కు చెక్ పెట్టేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆ ఎమ్మెల్యేను పార్టీ నుంచి బహిష్కరించాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

లాలాపేట: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆదం విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నాయకత్వంలో గత తొమ్మిదేళ్లలో పేదల సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. నగరానికి చెందిన అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే అర్ధరాత్రి ఓ మహిళా కార్పొరేటర్‌కు ఫోన్ చేశారని ఆ ఎమ్మెల్యే ఎవరూ అనేది ప్రజలకు తెలియాల్సి ఉందన్నారు. ఆ ఎమ్మెల్యేను వెంటనే పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. రవిప్రసాద్‌గౌడ్, హరి, నాగేశ్వర్‌రెడ్డి, రాము వర్మ, భరత్ ముదిరాజ్, వేణు, మణిస్వామి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే పరిసరాలు పరిశుభ్రం

అమీర్‌పేట: ప్రజల సహకారం ఉంటేనే కాలనీలు, బస్తీలను పరిశుభ్రంగా ఉంచగలుగుతామని జీహెచ్‌ఎంసీ సర్కిల్‌-17 ఏఎంఅండ్‌హెచ్‌వో భార్గవ నారాయణ అన్నారు. ఎస్ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్, రాయల సేవా సమితి సంయుక్తాధ్వర్యంలో మంగళవారం పారిశుద్ధ్య కార్మికులతో పాటు సంబంధిత అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ఎల్లమ్మ కల్యాణం సందర్భంగా అన్నదాన కార్యక్రమంలో ఏర్పడిన వ్యర్థాలను తెల్లవారే సరికి తొలగించి ఆలయ పరిసరాలను పరిశుభ్రమైన వాతావరణం కల్పించినట్లు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సిబ్బందిని అందుబాటులో పెట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు ఆర్.సి.కుమార్, కౌన్సిల్ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, సహదేవ్‌గౌడ్, విజయశ్రీ, నాగేంద్రమ్మ, అమరేశ్వరీ, అమరావతి.గిరియాదవ్, ప్రభు పాల్గొన్నారు.



భార్గవ్ నారాయణను సన్మానించిన ప్రతినిధులు

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి



పనులు ప్రారంభిస్తున్న లింగాని ప్రసన్నలక్ష్మి

సికింద్రాబాద్: డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు.అడ్డగుట్ట డివిజన్ తుకారాంగేట్ గోల్‌బావి వద్ద మంగళవారం ఆమె డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మురికివాడలకు నిలయంగా ఉన్న అడ్డగుట్ట డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలో తాగునీరు, మురుగునీరు, రహదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామన్నారు. జలమండలి డీజీఎం సరిత, ఏఈ నిఖితారెడ్డి, నాయకులు లింగాని శ్రీనివాస్, సత్తయ్యగౌడ్, పొన్నాల రాజు, అంజయ్య, వసంత, అమర్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

త్వరలో న్యూ గాంధీనగర్‌లో బస్తీ దవాఖానా ఏర్పాటు

రసూల్‌పురా: తిరుమలగిరి న్యూ గాంధీనగర్ బస్తీలో త్వరలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య మౌలిక వసతుల కల్పన సంస్థ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు పి. శ్యాంకుమార్‌తో కలిసి మంగళవారం ఆయన బస్తీ దవాఖానా ఏర్పాటు చేసే కమ్యూనిటీహాల్‌ను పరిశీలించారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న హయాంలో గాంధీనగర్‌లో బస్తీ దవాఖానా ఏర్పాటుకు ప్రభుత్వం రూ. 13.90 లక్షలు కేటాయించిందని కానీ.. బీజేపీ నాయకులు అడ్డుకోవడంతో ఏర్పాటు కాలేదని ఈ సారి ఎవరు అడ్డుకున్న సహించేది లేదని తప్పని సరి బస్తీ దవాఖానా ఏర్పాటు చేస్తామని శ్రీనివాస్ అన్నారు. బోర్డు పరిధిలో మొత్తం 9 బస్తీ దవాఖానాలు మంజూరయ్యాయని దశలవారీగా ఏర్పాటు చేస్తున్నామని రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ బస్తీవాసులు, ముప్పిడి మధుకర్, ప్రవీణ్‌యాదవ్ పాల్గొన్నారు.



బస్తీ దవాఖానా ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలి



వీసీకి వినతి పత్రం సమర్పిస్తున్న అధ్యాపకులు

సికింద్రాబాద్: కావాల్సిన విద్యార్హతలు, 20 ఏళ్లకు పైగా బోధన అనుభవం, యూనివర్సిటీ గురించి పూర్తి అవగాహన గల కాంట్రాక్టు అధ్యాపకుల పర్మనెంట్‌తోనే ఓయూ బలోపేతం అవుతుందని కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం చలో ఓయూ పిలుపు మేరకు కాంట్రాక్టు అధ్యాపకులు పాలన భవనం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం వీసీని కలిసి పర్మనెంట్ విషయమై చర్చించారు. రిక్రూట్‌మెంట్ బోర్డు ఫైల్ పెండింగ్‌లో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ఇప్పట్లో ఓయూలో అధ్యాపక ఉద్యోగాల భర్తీ జరగదని, అధ్యాపకుల కొరతను తీర్చేందుకు ప్రస్తుతం పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని వీసీకి వినతి పత్రం ఇచ్చారు. జేఏసీ చైర్మన్ డా.పరుశురామ్, కన్వీనర్ డా.ధర్మతేజ, కోఆర్డినేటర్లు తాళ్లపల్లి వెంకటేశం, డా.రామ్మోహన్‌రావు, డా.విదిశా, డా.మహేశ్వరరెడ్డి, డా.తిరుపతి, డా. పరందాములు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అడిగితే ఇవ్వలేదని బీర్ బాటిళ్లతో దాడి

బౌద్ధనగర్: సెల్‌ఫోన్ అడిగితే ఇవ్వకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు బీర్ బాటిళ్లతో కొట్టి పరారైన ఘటన వారాసీగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ వివరాల ప్రకారం.. బాపూజీనగర్ ప్రాంతానికి చెందిన దుర్యోధన్ (30) మంగళవారం మూన్‌రాక్ బార్‌కు వచ్చి మద్యం తాగుతు న్నాడు. పక్క టేబుల్‌పై కూర్చున్న పలువురు దుర్యోధన్‌ను ఒక్కసారి సెల్‌ఫోన్ ఇవ్వమని అడగడంతో అ తను ఇవ్వలేదు. మద్యంమత్తులో ఉన్న సదరు వ్యక్తు లు దుర్యోధన్‌పై బీరు బాటిళ్లతో దాడి చేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘట నా స్థలానికి చేరుకొని దుర్యోధన్‌ను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సీసీ కెమెరాల ఆధారంగా దాడికి పాల్పడిన గుర్తు వ్యక్తుల కోసం గాలిస్తున్నామన్నారు.

గ్రీన్ చానల్ ద్వారా లైవ్ ఆర్గాన్ తరలింపు

రాంగోపాల్‌పేట్: హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి వరకు గ్రీన్ చానల్‌ను ఏర్పాటు చేసి 27 నిమిషాల్లో లైవ్ ఆర్గాన్ (లివర్) తరలించారు. వివరాల్లోకి వెళితే బ్రెయిన్ డెడ్‌కు గురైన వ్యక్తి లైవ్ ఆర్గాన్ లివర్‌ను మంగళవారం రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టుకు తీసుకుని వచ్చారు. అక్కడి నుంచి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి వీటిని ఈ సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఈ మార్గంలో ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ గ్రీన్ చానల్ ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2.12 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి లైవ్ ఆర్గాన్‌తో అంబులెన్స్ బయలుదేరిన అంబులెన్స్ 2.39 నిమిషాలకు సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి చేరుకుంది. సైబరాబాద్, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి లైవ్ ఆర్గాన్‌ను తరలించి చికిత్స పొందుతున్న వారి ప్రాణాలు కాపాడారు. ఇప్పటి వరకు 9 సార్లు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు గ్రీన్ చానల్ ద్వారా లైవ్ ఆర్గాన్‌ను తరలించినట్లు అదనపు కమిషనర్ (ట్రాఫిక్) సుధీర్‌బాబు తెలిపారు.

కాంగ్రెస్‌ను వీడిన వారికి గుణపాఠం తప్పదు

అమీర్‌పేట: కాంగ్రెస్‌లో అనేక పదవులను అనుభవించి పార్టీని వీడిన నాయకులకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ నేత రవిందర్‌గౌడ్ అన్నారు.రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా పదవి చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం సనత్‌నగర్ నియోజకవర్గ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతం అవుతుందన్నారు. పార్టీని వీడిన వారు తిరిగి సొంత గూడికి రప్పించేందుకు పార్టీ అధినేత రాహుల్ గాంధీ 'ఘర్ వాపసీ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. షాబాద్ సత్యనారాయణ, బాబు, కమల్‌రాజ్, రమేష్, విఠల్, మణిమాల పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. మంగళవారం అమన్ వేదిక, అసోసియేషన్ ఫర్ నీడీ స్వచ్ఛంద సంస్థల సౌజన్యంతో ఏర్పాటు చేసిన పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్ సామల హేమ పాల్గొని అందజేశారు.విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ముందుకు వచ్చి సంస్థ ప్రతినిధులను కార్పొరేటర్ అభినందించారు. చిలకలగూడ ఎస్‌ఐ శ్వేత, ప్రధానోపాధ్యాయురాలు బసంతి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అలియా, జయ, మయబ్రహ్మ నరసింహ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

లాలాపేట: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉంటే భవిష్యత్‌లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. తార్నాకలోని డేవిడ్ మెమోరియల్ హైస్కూల్లో సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత, ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆటోలు, ప్రైవేట్ బస్సులలో వెళ్లే విద్యార్థులు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరించారు. మైనర్ డ్రైవింగ్ నేరం అన్నారు, ట్రాఫిక్ ఉల్లంఘనలతో కలిగే ప్రమాదాలు, తదుపరి చర్యల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూపించారు. స్కూల్ డైరెక్టర్ సుచిత్ర, ప్రిన్సిపాల్ దయానా, విద్యార్థులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

రసూల్‌పురా: మూడవ వార్డు జనక్‌పురి కాలనీలో అక్రమంగా వెలసిన నిర్మాణాలను మంగళవారం సంబంధిత అధికారులు కూల్చివేశారు. జనక్‌పురి కోఆపరేటివ్ సొసైటీ ప్లాట్ నంబర్‌-1 ఖాద్రీకి చెందిన స్థలానికి ఆనుకుని ఉన్న పార్క్‌స్థలంలో ముజ్తాబా గ్రిల్స్ హోటల్ నిర్వాహకులు నిర్మించిన అక్రమ షెడ్డు, ఓల్డ్ గ్రాంటెడ్ బంగ్లా నంబర్ 216కు సంబంధించిన స్థలంలో ఫ్లేమింగ్ ఓక్ రెస్టారెంట్ ఎదురుగా అక్రమంగా నిర్మించిన ఫుట్‌పాత్‌ను కూల్చివేశారు. గోపాల కృష్ణదాస్, బాలకృష్ణ, ఉమాశంకర్, దినేష్, దేవేందర్ పాల్గొన్నారు.

ప్రశ్నాపత్రంలో సమాధానాలు రాసిచ్చిన అధికారిపై కేసు

అమీర్‌పేట: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థికి ప్రశ్నాపత్రంలో సమాధానాలు రాసిచ్చిన డిపార్ట్‌మెంట్ అధికారిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. ఎస్ఆర్‌నగర్‌లోని అమోఘ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 15న గణితం-బీ పరీక్ష జరుగుతుండగా డిపార్ట్‌మెంట్ అధికారిగా ఉన్న ఆంజనేయులు ఓ విద్యార్థికి పెన్సిల్‌తో ప్రశ్నాపత్రంలో సమాధానాలు రాసిచ్చాడు.ఈ విషయాన్ని గుర్తించిన కళాశాల ప్రిన్సిపల్ పరీక్షా కేంద్రం అదనపు చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.వెంకటేశ్వర్‌రావుతో పాటు పరీక్షల హైపవర్ కమిటీ సభ్యులు అర్షద్ సిద్ధిఖీకి ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన హైపవర్ కమిటీ అధికారులు ఆంజనేయులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు నిర్ధారించారు. జిల్లా ఇంటర్మీడియేట్ బోర్డు అధికారి ఓడెన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

దేవాలయాలకు కొత్తశోభ

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని స్కందగిరి దేవాలయంలో మంగళవారం దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రితో పాటు సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆయన పక్కనే ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పునర్నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో తెలంగాణలో ఆలయాలకు కొత్త శోభ సంతరించుకుందని, అందుకు నిదర్శనం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహా దేవాలయం అన్నారు. మంత్రి వెంట అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, ఆలయ ఈవో రాజేష్ తదితరులు ఉన్నారు.

జోరందుకున్న గొర్రెలు, పొట్టేళ్ల అమ్మకాలు

సనత్‌నగర్: బక్రీద్‌ను పురస్కరించుకుని గొర్రెలు, పొట్టే ళ్లు, మేకల అమ్మకాలు జోరుందుకున్నాయి. ఎర్రగడ్డ-సనత్‌నగర్ రహదారిలో ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటుచేసి విక్రయాలు జరుపుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది గొర్రెల దిగుమతి తగ్గడంతో డిమాండ్ పెరిగి ధరలు కూడా పెరిగిపోయాయి. గతేడాది రూ.7 వేలు పలికిన గొర్రె ఈ సారి రూ.10 వేల వరకు పెరిగినట్లు అమ్మకందారులు చెబుతున్నారు. చెంగిచర్ల, కర్నూలు, కడప, పెబ్బర్ వంటి దూర ప్రాంతాల నుంచి నగరానికి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు.



పూడికతీత తొలగింపు

బౌద్ధనగర్: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నామని కార్పొరేటర్ శైలజ తెలిపారు. పేరుకుపోయిన పూడికతీతను మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీ మ్ సిబ్బందితో తొలగింపజేశారు.